76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18





# రాజధాని వార్తలు

Voice of Voiceless





అమరావతి సంపుటి : 3 సంచిక 51, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 10 - ఆదివారం 16 సెప్టెంబర్, 2018

వివరాలు2లో...



వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ

వివరాలు3లో...



అమెరికాలో 'ఎన్ఆర్ఐ పల్స్'

వివరాలు4లో...



పెట్రోలు, డీజిల్ ధరలు పైపైకి...

వివరాలు4లో...



రూపాయి పతనం ఆగేదెన్నడు ?

## 10న భారత్ బంద్

### వామపక్షాలు, కాంగ్రెస్ పిలుపు





**న్యూఢిల్లీ :** మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, పెట్రోలు ధరల పెంపుపై నిరసనగా సెప్టెంబర్ 10న భారత్ బంద్‌కు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై విపరీతమైన ఆర్థిక భారాలు మోపుతోందని వామపక్షాలు, కాంగ్రెస్ విమర్శించాయి. తాజాగా పెట్రోలియం ఉత్పత్తులు విపరీతంగా పెరిగిపోతుండడంతో కోట్లాది మంది ప్రజల జీవనోపాధిపై ప్రభావం చూపుతోందని, ఇప్పటికే వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోవడంతో పాటు రైతులకు ఉత్పత్తి ఖర్చులు కూడా పెరిగిపోయాని పార్టీలు తెలిపాయి. ఈ ధరల పెరుగుదలతో అన్నింటిపై ద్రవ్యోల్బణ ప్రభావం కన్పిస్తోంది. ఇది ఇప్పటికే ఉన్న ఉపాధిని మరింతగా తగ్గించే ఆర్థిక మాంద్యానికి దోహదం చేస్తుంది. డాలర్ మారకం విలువతో భారత రూపాయి పతనం మోడీ ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని ప్రతిబింబిస్తోంది. మోడీ ప్రభుత్వ మితవాద మతతత్వ నిరంకుశ వైఖరి వల్ల ప్రజలపై ఇటువంటి ఆర్థిక దాడులు జరుగుతున్నాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో కార్పొరేట్ సంస్థలకు నాలుగు లక్షల కోట్ల రూపాయలను బ్యాంకు రుణాల రూపంలో కట్టబెట్టిందని ఆయాపార్టీల నాయకులు దునుమాడారు. రుణాల ఎగవేత కారణంగా వాటిని నిరర్థక ఆస్తులుగా ప్రకటించడంతో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత కుప్పకూలిందని, రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి పౌరహక్కుల నేతలపై దాడులు, హింసాత్మక వాతావరణాన్ని సృష్టించడం, సామాజిక కార్యకర్తలు అరెస్టులు వంటి చర్యలకు పాల్పడిందని వామపక్షాలు దునుమాడాయి. ఈ పరిస్థితులకు నిరసనగా సెప్టెంబర్ 10న భారత్‌బంద్‌కు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి.

## 14 నుంచి కాంట్రాక్ట్ వైద్యుల సమ్మె

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఏపీ ఆర్యోగశాఖలోని కాంట్రాక్ట్ వైద్యులు సమ్మెకు దిగనున్నారు. ఈ నెల 14లోపు తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ఆ రోజు నుంచి విధులు బహిష్కరించనున్నట్లు కలెక్టర్లు, డీఎమ్‌హెచ్‌ఓలకు నోటీసులు అందించారు. మూడేళ్లు దాటిన కాంట్రాక్ట్ వైద్యులను రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన చేస్తుండగా ప్రభుత్వం వీరిని పట్టించుకోవడం లేదు. వీరు సమ్మెకు దిగితే గ్రామీణ,ఏజెన్సీ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ లకు వెళ్లే రోగులకు వైద్యసేవలు అందవు.

# డీఎస్సీ ఎండమావేనా ?

### విద్యార్థుల ఆవేదన

**ఇంటింటికి ఉద్యోగం ఇస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి అందిస్తామని అధికారం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందని నిరుద్యోగులు భావిస్తున్నారు.రాష్ట్రంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు జరపకుండా ప్రభుత్వం దాటవేతను కొనసాగిస్తోందని నిరుద్యోగులు వాపోతున్నారు.**



**రాజధాని వార్తలు, అమరావతి బ్యూరో :** తాజాగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంశంపై ఏడాది నుంచి డీఎస్సీపై సీఎం చంద్రబాబు, మానవ వనరులశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు వేర్వేరుగా ప్రకటనలిస్తూ నిరుద్యోగులకు ఆశలు కల్పించారు. డీఎస్సీ ప్రకటన ఆమోదానికి కేబినేట్‌లో ఒక కీలక నిర్ణయం తీసుకుంటామని ఇటీవల మంత్రి గంటా మీడియాకు వెల్లడించారు. దీంతో ఈ విడత ప్రకటన తప్పకుండా వస్తుందనే ఆశతో అభ్యర్థులున్నారు. 2017-డిసెంబరు నుంచి ఇప్పటివరకూ నాలుగు సార్లుగా డీఎస్సీని ప్రభుత్వం వాయిదా వేయడమే ఇందుకు నిదర్శనీయం. తొలుత 10,251 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించగా, వాటికి ఆర్థికశాఖ కొర్రి వేసి దాదాపు 9వేల పోస్టులకే ఆమోదముద్ర వేసింది. ఉన్న పోస్టులకు సైతం ప్రకటన ఇవ్వకపోవడంపై తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. ఉన్న పోస్టులకు సైతం ప్రకటన ఇవ్వకపోవడంపై తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. నిరుద్యోగ అభ్యర్థులతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని దయ్యబడు తున్నారు.

**వాయిదాల పర్వం**

'అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ' అంటూ మంత్రి పదేపదే హామీలిచ్చి తుదకు వాయిదాలు వేయడాన్ని నిరుద్యోగ అభ్యర్థులు తప్పుపడు తున్నారు. తెలంగాణా రాష్ట్రంలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియ దాదాపు పూర్తిదశకు చేరుకుంది. ఏపీ ప్రభుత్వం నాన్చుడు ధోరణితో ఉందని, నిరుద్యోగులతో చెలగాటమాడుతోందని విద్యార్థి, యువజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందస్తుగా అనగా డిసెంబరు/జనవరిలో డీఎస్సీతోపాటు వివిధ ఖాళీల పోస్టుల భర్తీకి వరుస వారీగా నోటిఫికేషన్ ఇస్తారని తెలిసింది.

డీఎస్సీ ప్రకటన వస్తుందన్న నమ్మకంతో ఏడాది నుంచి వివిధ కోచింగ్ సంస్థల్లో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం జంబో డీఎస్సీ ఇస్తుందనే ఆశతో వారుండగా, కనీసం మినీ డీఎస్సీకి ముందుకు రాలేదని వాపోతున్నారు. ఇప్పటికే ఏడాది నుంచి రెండు, మూడు దశలుగా డీఎస్సీకి శిక్షణ తీసుకుని ఆర్థికంగా చితికిపోయామని పేర్కొంటున్నారు. మంత్రి గంటా పదేపదే వాయిదా వేయడంతో, ప్రభుత్వంపై నమ్మకం లేక శిక్షణ తీసుకుంటున్న కొందరు ఇంటిబాట పడుతున్నారు. వయోపరిమితి దగ్గర పడిన వారి పరిస్థితి దయ నీయంగా మారింది. ప్రభుత్వ మోసపూరిత విధానాల్ని ఎండగడుతూ దశల వారీ ఉద్యమాలకు విద్యార్థి, యువజన సంఘాల నేతలు ప్రణాళిల రూపొందిస్తున్నారు.

## ముదిరాజ్‌ల గోడు వినండి : గోనేపల్లి



ఏపీ ముదిరాజ్ సేవా సంఘం



సీఎం చంద్రబాబు నాయుడుకి తమ సమస్యలను వివరిస్తున్న గోనేపల్లి చిన్న నాగేశ్వరరావు (ఫైల్)

**చెరువు ప్రాంతంలో చేపలు, అడవి ప్రాంతంలో ఆకులు అమ్ముకుంటూ వ్యవసాయ ప్రాంతంలో రైతు కూలీలుగా ముదిరాజ్‌లు జీవిస్తున్నారు.**

**రాజధాని వార్తలు ప్రతినిధి, నందిగామ :** రాష్ట్రంలో 15 లక్షమంది ఉన్న ముదిరాజ్‌లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ముదిరాజ్ సమాజ్ నాయకులు గోనేపల్లి చిన్న నాగేశ్వరరావు గూడాల సత్యనారాయణ, చుక్కా శ్రీనివాసరావులు విమర్శించారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్‌లను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి ఇప్పటికే అనేక సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని వారు వాపోయారు. **తమ సామాజిక వర్గానికి ఆర్థిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల్లో, పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానాలు కల్పించాలని, అమరావతిలో సంఘం భవనానికి ఐదెకరాల స్థలం కేటాయించి, ముదిరాజ్ సామాజికవర్గాన్ని ఎస్టీ లేదా బీసీ ఏలో చేర్చాలని వారంతా కోరారు.** ముదిరాజులకు ఒక కుల వృత్తి లేకపోవడంతో బందరు ,జగ్గయ్యపేటల్లో మత్స్యకారులుగా అటవీ ప్రాంతాల్లో అడవినుంచి చింతపండు వంటి అటవీ ఉత్పత్తులు అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నారని, బీసీ'డి'ల్లో ఎటువంటి సంక్షేమ పథకాలను అందుకోలేకపోయిన ఈ వర్గాన్ని బీసీ 'ఏ'లో చేర్చి తమ అభ్యున్నతికి కృషి చేయాలని చిన్న నాగేశ్వరరావు డిమాండు చేశారు. తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలుగా పనిచేస్తున్నా.. గుర్తింపులేదని తక్షణమే ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించాలని వారు డిమాండు చేశారు. లేదంటే ఆంధ్రా ముదిరాజ్‌లంతా మహాసభ నిర్వహించి రాజకీయ, సామాజిక ఆర్థికాభివృద్ధి కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సత్తా చూపుతామని వారు స్పష్టం చేశారు.

# ఎన్నికల కమిషన్ 'ముందస్తు' సమ్మతం

### ముఖ్యమంత్రి వివరణ



**రాజధాని వార్తలు ప్రతినిధి, హైదరాబాద్ :** తెలంగాణా శాసనసభకు ముందస్తు ఎన్నికల నిర్వహణా విషయమై తాను స్వయంగా ప్రధాన ఎన్నికల అధికారులతో చర్చించినట్లు విలేఖరులు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రకటించటం అందరినీ ఆశ్చర్యప రిచింది. చంద్రశేఖరరావు ప్రకటన ముందస్తు ఎన్నికలకు ముందుగానే ప్రధాన ఎన్నికల అధికారి అంగీకరిం చారనే అభిప్రాయాన్ని కలిగిస్తున్నదని కొందరు విశ్లేషకులు అంటున్నారు. తెలంగాణా పి.సి.సి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా చంద్రశేఖరరావు ప్రకటనపై అభ్యంతరం చెప్పారు. శాసనసభ రద్దుపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోవటానికి ముందే ప్రధాన ఎన్నికల అధికారి ఏ విధంగా అంగీకరిస్తారని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. కాగా ముందస్తు ఎన్నికల ప్రకటననూ ముందస్తు ఎన్నికలపై తమకు సమాచారం లేదని రాష్ట్ర ఎన్నికల అధికారి ప్రకటించటం గమనార్హం. చంద్రశేఖరరావు ప్రకటన ప్రధాన ఎన్నికల అధికారిని ముందస్తు విషయం లో భాగస్వామిని చేసినట్లున్నదని విశ్లేషకులు అంటున్నారు.

# రాహుగ్రస్త ముందస్తు?

### రాహు కాలంలో తెలంగాణా శాసనసభ రద్దు ఫైల్‌పై గవర్నర్ సంతకం


**రాజధాని వార్తలు ప్రతినిధి, హైదరాబాద్ :** ప్రధాన నిర్ణయాలు తీసుకునే సమయంలో తిథి వార, నక్షత్రాలు, ముహూర్తబలం చూసుకొనటం తెలంగాణా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేరరావుకు అలవాటు. జ్యోతిష్యుల సలహామేరకే చంద్రశేఖరరావు శాసనసభ ముందస్తు ఎన్నికల నిర్ణయం తీసుకున్నట్లు విస్తృత ప్రచారం జరిగింది. ముహూర్తాలు చూసుకునే సెప్టెంబరు 6న శాసనసభ రద్దు చేయాలని ముఖ్యమంత్రి అనుకున్నారు. మంత్రి వర్గ నిర్ణయంతో గవర్నర్ నరసింహన్‌ను 1.30 గంటలకు కలిసారు. నరసింహన్ 1.50 గంటలకు శాసనసభ రద్దు ఫైల్ పై సంతకం చేసినట్లు రాజ్‌భవన్ వర్గాలు ప్రకటించాయి. గురువారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటవరకు రాహుకాలం ఉంటుంది. ఆ సమయంలో పనులు చేయరు. అటువంటిది శాసనసభ రద్దుపై గవర్నర్ 1.50 గంటలకు సంతకం చేయటం ఆశాభంగం అని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. రాహుకాలానికి ముందే చంద్రశేఖరరావు గవర్నర్‌ను కలిశారని, అంటే రాహు కాలానికి ముందే గవర్నర్‌ను కలిసినందున 1.50 గంటలకు సంతకం చేయడంతో దోషం లేదని కొందరు అంటున్నారు.



ఆంధ్రప్రదేశ్ మ్యూజిషియన్ అసోసియేషన్ గుంటూరు వారి ఆధ్వర్యంలో ప్రముఖ మ్యూజిషియన్ జూదూగర్ ఆనంద్‌కు జాదు ఛక్రవర్తి సామ్రాట్ అవార్డును అందజేశారు.


## ఈవారం రాజధాని


- యుద్ధ ప్రాతిపదికన రోడ్లు, రహదారుల మరమ్మత్తులు నవంబర్‌కు శబరిమల సిద్ధం: కేరళ పర్యాటక కార్యదర్శి రాణి
- కొండవీటి వాగు ఎత్తిపోతల పథకాన్ని ఈ నెల 10న సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.
- దాదాపు లక్షమందితో జనవరిలో బ్రాహ్మణ మహాసభను ఏర్పాటు చేయనున్న బ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద సూర్య




# నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

**మన దేశం, అందునా దక్కన్ సంస్థానంలోని హైదరాబాద్ ఎన్నో చారిత్రాత్మక కట్టడాలకు, అంతులేని వారసత్వసంపదకు ఆనవాలం. అయితే నిర్లక్ష్యంతో వాటిని పరిరక్షించుకోలేక పోతున్నాం. నిజాం మ్యూజియంలోని కళాఖండాల తస్కరణ ఈ విషయాన్ని కళ్లకు కడుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ వారసత్వ సంపదలను రక్షించడానికి కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.**





**హైదరాబాద్ :** మేలిమి బంగారంతో కళాత్మకంగా తయారు చేసిన అందమైన టిఫిన్ బాక్స్ హైదరాబాద్‌లోని నిజాం మ్యూజియం నుంచి అపహరణకు గురైంది. చారిత్రక ప్రాధాన్యం ఉన్న అరుదైన-విలువైన వస్తువులెన్నో ఉన్న ఈ మ్యూజియంలో దొంగలు పడి బంగార టిఫిన్ డబ్బాతో పాటు రత్నాలు పొదిగిన బంగారు టీ కప్పు, సాసర్, చెంచాను తీసుకుపోయారు. అనుమానాస్పద వ్యక్తులు వచ్చినప్పుడు మోగే అలారాలు, సెన్సార్లు వంటివి లేవని, ఇంతకు ముందు ఇక్కడ పనిచేసేవారే వీటిని దొంగిలించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దొంగ మ్యూజియం వెనుక భాగంలోని వెంటిలేటర్ నుంచి తాళ్ల సాయంతో వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తించారు.

నిజాం రాచ మందిరాల్లో ఒకటైన ఈ మ్యుజియంకు ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. ఎన్నో ఆభరణాలు, కళాఖండాలు, పెయింటింగ్స్, అలాగే పురాతన కార్లు ఈ పురావస్తు ప్రదర్శనశాలలో ఉన్నాయి.

"ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ పాతికేళ్ళ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 1936లో రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పబ్లిక్ గార్డెన్‌లోని జూబ్లీహాలులో సామంతులు,

### మ్యూజియంలోని విలువైన వస్తువులు మాయం

నవాబులు, ఇతరదేశాల ప్రతినిధులు ఆయనకు ఎన్నో జ్ఞాపికలు, విలువైన బహుమతులను అందించారు. తనకు లభించిన బహుమతులు, కళాఖండాలు జనం చూడటం కోసం ప్రదర్శించాలని నిజాం అనుకున్నారు. ఆయన ఇష్టానికి అనుగుణంగా ప్రజలకు నిజాం పాలన, సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా మ్యూజియం ఆవిర్భవించింది" అని నిజాం మునిమనవడు నవాబ్ నజఫ్ అలీఖాన్ వివరించారు.

నిజాం మ్యూజియం చార్మినార్ సమీపంలోని పురానీహవేలిలో ఉంది. గతంలో ఇది నిజాంల ప్యాలెస్‌గా ఉండేది. అనంతరం నిజాం ట్రస్టు ఆధ్వర్యంలో 2000 ఫిబ్రవరి 18న మ్యూజియంగా మార్చారు. అక్కడ ప్రదర్శనకు పెట్టిన నిజాంకు చెందిన వస్తువుల విలువ సుమారు రూ. 400 కోట్ల పైమాటే.. మ్యూజియంలో

- మిగతా 4 లో

రాజధాని వార్తలు
కలం


# విజేత కోసం నిరీక్షణ

అధికార పార్టీలు ప్రత్యర్థి వర్గాలను ముప్పుతిప్పలు పెట్టడానికి ఎన్నికలను వాడుకుంటున్నాయి.అందులో భాగంగానే తొమ్మిది నెలల ముందుగానే ఎన్నికలు.. విపక్షాలు ఎన్నికలకు సిద్ధమయ్యే సమయం ఇవ్వకుండా అధికార పార్టీల అన్నీ రెడీ చేసుకోవడమే ముందస్తు ఎన్నికలు.. ఎలాగో అధికారం కలిగి ఉంటారు కాబట్టి పరిస్థితులను వారికి అనుగుణంగా మార్చుకోవచ్చన తపన దీనిలో కనిపిస్తోంది. పత్రికలన్నీ ఘోషించినట్లుగానే తెలంగాణముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముందస్తు ఎన్నికలను ప్రకటించారు. అధికార పార్టీ అయినంత మాత్రాన ముందస్తులో విజయం సాధించడం అంత సులభం కాదని చరిత్ర చెబుతోంది. 1970లో ఇందిరా గాంధీ ముందస్తుకు వెళతారని ఊహాగానాలు చెలరేగినప్పుడు ఆమె వాటిని ఖండించారు. అయితే ప్రజల అంచనాలను నిజం చేస్తూ ఆమె ఎడాది ముందు ఎన్నికలు నిర్వహించి అనూహ్యంగా గెలిచారు. 2003లో అలిపిరిలో మావోయిస్టుల దాడి నుంచి తప్పించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సానుభూతిని ఓట్లుగా మార్చుకోవడం కోసం ముందస్తుకు వెళ్లారు. అదే సమయంలో ప్రధాని వాజ్‌పేయిని కూడా అందులో భాగస్వామ్యం చేశారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బొక్కబోర్లా పడ్డాయి. కాని అంతకుముందు ఎన్టీఆర్ సమయంలో ముందస్తులో విజయం సాధించారు. ఆ సమయంలో ఎన్టీఆర్ వద్ద ఇద్దరు చంద్రులు ఉన్నారు.

కేసీఆర్ ముందుస్తుకు వెళ్లడంలో చాలా ముందుచూపుందని తెలుస్తోంది. అందరితో పాటు వెళితే రాహుల్‌గాంధీ - నరేంద్ర మోడీలకు జరిగే ఎన్నికలుగా ప్రజలు గుర్తుపెట్టుకుంటారని, రాష్ట్రంలో తనదైన ముద్ర ఉండాలంటే తప్పకుండా ముందస్తుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇదే సమయంలో కేంద్రంలో చక్రం తిప్పాలన్న ఆలోచన కూడా ఉంది. చంద్రబాబే ..పదే..పదే నేను అప్పుడు కేంద్రంలో చక్రం తిప్పానని తన రాజకీయ ప్రస్తావనను వల్లెవేయడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పవచ్చు.

ఏది ఏమైనా అస్త్రశస్త్రాలన్నీ టీఆర్ఎస్ సిద్ధం చేసుకొని ప్రత్యర్థి కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేసేందుకు గట్టి కృషి చేస్తోంది. వాస్తవానికి కేసీఆర్ పాలన అంత జనరంజకంగా లేదన్నది మొన్న జరిగిన ప్రగతి నివేదన సభలోనే తెలిసిపోయింది. నోట్లు పంచడం ఆర్టీసీ,ప్రైవేటు, ఇతర వాహనాలన్నింటినీ మొబైల్ మద్యం దుకాణాలుగా మార్చారని వార్తలు రావడం, ఒక్కో మనిషికి రూ.300 పంచడం వంటి దృశ్యాలు వైరల్ అవడంతో పార్టీపై ప్రజల్లో నమ్మకం సడలిందన్న ఊహకలగక మానదు. కేసీఆర్ మొదటి నుంచి మాటకు విలువ ఇచ్చే వ్యక్తి కాదన్న విషయం చాలా సంఘటనల ద్వారా నిరూపణ అయింది. మొదట కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రం ఇస్తే పార్టీని కాంగ్రెస్‌లో కలుపుతానని, ఆపై తెలంగాణకు దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, ఆపై బీసీలకు వరాలు ఇస్తానంటూ పదవిచేపట్టిన కేసీఆర్ బీసీ సర్వే చేయించి బీసీలు 52 శాతం ఉండగా, పాత జనాభా లెక్కల ప్రకారం పంచాయతీ ఎన్నికలు జరిపించాలను కోవడంతో కథం అడ్డం తిరిగి ఎన్నికలు నిలిచి పోయాయి. మన రాష్ట్రంలో మన పోరగాళ్లకే ఉద్యోగాలు..ఆంధ్రోళ్లని తరిమికొడదాం.. అని నిరుద్యోగులను రెచ్చగొట్టిన ఆయన ఆపై ఆయన ఇద్దరు పిల్లలకు తప్ప వేరే ఎవరికీ ఉద్యోగ నియామకాలు జరపలేదు. షెడ్యూలు కులాలు, తెగలు, బీసీ, ముస్లింలకు ఆయన ఎన్నికల్లో చేసిన ఏ వాగ్దానాన్ని నిలుపుకోలేదు. ముందస్తు ఎన్నికలకు వెళుతున్నామన్న భావనతో రైతు బంధు పథకం అమలు చేసి చాలా చేసేశాం..అనే నినాదంతో ముందుకెళుతోంది. ఆ రాష్ట్రంలో కూడా ఇంకా జలవనరుల ప్రాజెక్టులు నిర్మాణ దశలోనే ఉన్నాయి.

ఇన్ని లొసుగులు టీఆర్ఎస్‌లో ఉన్నా.. బీజేపీ అంతగా ఆరాష్ట్రంలో చొచ్చుకెళ్లలేకపోయింది. వామపక్షాల బలం అంతంత మాత్రమే.. ప్రొఫెసర్ కోదండరామ్ తెలంగాణ జనసమితి పార్టీ ఇంకా పురిటిలోనే ఉంది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్‌కు ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమే.. అధికారపార్టీపై ప్రజలకు ఉండే వ్యతిరేకతను ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్ పార్టీ వెనుకబడుతోంది. ఆపార్టీ ప్రజావ్యతిరేకతను చాటి చెప్పడంలో పార్టీ నేతలంతా ఏకత్వం చూపలేకపోతున్నారు. ఆగస్టులో రెండురోజులపాటు సభలు,సమావేశాలు నిర్వహించిన కాంగ్రెస్ అధినేత ప్రస్తుతం మనసరోవర్ యాత్రలో ఫోటోలను ట్వీట్‌లతో పోస్టు చేస్తున్నారు. ఆయన యాత్ర ఈ నెల 12 వరకు కొనసాగుతుంది. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా ఒకవైపు టీఆర్ఎస్ ముందుకు దూసుకుపోతుంటే..విధాన నిర్ణయాలతో ప్రజలు ముందుకెళ్లడానికి కాంగ్రెస్ అనేక అవాంతరాలను ఎదుర్కొంటోంది. కేసీఆర్‌పై ప్రజావ్యతిరేకత ఉందా ? కాంగ్రెస్ ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటుందా ? విజేత ఎవరు అనేది ఎన్నికల ఫలితాల్లో గాని తెలదు.. అంతవరకు నిరీక్షణే...




## వక్రతుండ మహాకాయ
# కోటి సూర్య సమప్రభ



వినాయక చవితి భారతీయ పండుగలలో ఒకటి. పార్వతీపరమేశ్వరుల పుత్రుడైన వినాయకుడి పుట్టిన రోజు. పురాణ గాథలలో శివుడు వినాయకుడిని అందరు దేవతలలోకి మిన్నగా ప్రకటించిన రోజు. వినాయకుని జ్ఞానానికి, సంపత్తుకి మంచి అదృష్టానికి దేవతగా మరియు ప్రయాణం ప్రారంభించేటప్పుడ, లేక కొత్త పనులు చేపట్టేటప్పుడు ప్రార్థించటం సర్వసాధారణం. ఈ పండుగ బాధ్రపద మాసంలో శుక్ల చతుర్థి నాడు ఈ పండుగ జరుపుతారు.

**శుక్లాంబరధరం విష్ణు: శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనంధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే**
**అగజానన పద్మార్కం గజాననమవార్నిశం**
**అనేకదం తం భక్తానాం ఏకదంతం ఉపాస్మహే...**

### పూజా విశేషాలు

వినాయక చవితి నాడు విఘ్నేశ్వరుడిని 21 రకాల ఆకులతో పూజిస్తారు. 1. మాచీ పత్రం/మాచ పత్రి 2. దూర్వా పత్రం/గరిక 3. అపామార్గ పత్రం/ఉత్తరేణి 4. బ ృహతీ పత్రం/ములక 5. దత్తూర పత్రం/ఉమ్మెత్త 6. తులసీ పత్రం/తులసి 7. బిల్వ పత్రం/మారేడు 8. బదరీ పత్రం/రేగు 9. చూత పత్రం/మామిడి 10. కరవీర పత్రం/గన్నేరు 11. మరువక పత్రం/ధవనం, మరువం 12. శమీ పత్రం/జమ్మి 13. విష్ణుతకాంత పత్రం/ 14. సింధువార పత్రం/వావిలి 15. అశ్వత్థ పత్రం/రావి 16. దాడిమీ పత్రం/దానిమ్మ 17. జాజి పత్రం/జాజిమల్లి 18. అర్జున పత్రం/మద్ది 19.దేవదారు పత్రం 20. గండలీ పత్రం/లతాదూర్వా 21. అర్క పత్రం/జిల్లేడు.

### ఇది మనందరి పండుగ

హిందూ పండుగలలో ఒక్కో పండుగకు ఒక్కో విశేషం వుంది. ఏటా భాద్రపద శుద్ధచవితినాడు వచ్చే వినాయకచవితి మనందరి పండుగ.

హిందూ సాంప్రదాయం ప్రకారం వినాయకుడు సకల దేవతా గణానికి అధిపతి (గణనాయకుడు), అన్ని పూజలకు ప్రప్రథమంగా పూజింపవలసినవాడు. అందుకే ప్రతి శుభకార్యానికి, పూజకు మొదటిగా మనం గణపతి పూజతోనే ప్రారంభిస్తాం. అది పిల్లవాడి బారసాల, విద్యాభ్యాసం నుండి, వివాహం, శంకుస్థాపన, గృహ ప్రవేశం, వ్యాపార ప్రారంభోత్సవాలు, నూతన వాహనం కొనుగోలు ఇలా ఒక సందర్భం ఏమిటి మానవ జీవితంలో ప్రతి ప్రధానమైన శుభకార్యానికి మొదటిగా గణపతిని పూజించటం అనాదిగా సాంప్రదాయం.


ఇలా మన ప్రతి పని విజయానికీ, చదువుకు, జ్ఞానానికీ దిక్కైన దేవుడు మన వినాయకుడు. ముందుగా వినాయకుడిని సంతోష పెడితే ఆటంకాలు రాకుండా, కష్టాలు దూరమై, సకల కార్యాలు పొంది, ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని ప్రజల విశ్వాసం. భాద్రపదశుద్ధ చవితినాడు వినాయకుడు జన్మించినది. అన్ని విఘ్నాలపై ఆధిపత్యం జరిగినట్లుగా పురాణాల బట్టి పండితుడు తెలుపుతున్నందున మన దేశంతోపాటు ఇతర దేశాలలోని వారు కూడా ప్రతి సంవత్సరము భాద్రపదశుద్ధ చవితినాడు, బంగారం, వెండి మట్టితో తయారుచేసిన ప్రతిమలకు కుటుంబ సభ్యులు అందరూ పూజించటం వల్ల మంచి ఫలితాలు అందుతాయని పురాణకథలు తెలుపుచున్నాయి.

చవితిరోజున వినాయకుడు దగ్గర పండ్లు, పూలు, పత్రి అని పిలుచుకునే రకరకాల మొక్కల ఆకులు, పిండివంటలను వుంచి భక్తి శ్రద్ధలతో పూజిస్తూ ఆ దేవదేవుని గణగణాలను కీరిస్తాం, మనం మొదలుపెట్టే ప్రతిపనిలో ఎటువంటి విఘ్నాలు లేకుండా విజయం చేకూర్చాలని, జ్ఞానసిద్ధికోసం ప్రార్థిస్తాం.

– బోస్

# అన్నదాన సేవలో భాగస్వాములు కండి

## సీఎం చంద్రబాబు పిలుపు



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆకలిని జయించే అన్నదాన సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని మనం చెప్పుకుంటున్నా ప్రతి 9 మందిలో ఒకరు పస్తు గడుపుతున్నారు. దేశంలో దాదాపు 19 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది భావి భారత పౌరులైన పిల్లలే ఎక్కువగా వుంటున్నారు. అందుకే నిరుపేదలకు పట్టెడన్నం పెట్టడం కంటే ప్రజాసేవ ఇంకేముంటుందని చెప్పిన ఎన్టీఆర్ మాటలను స్ఫూర్తిగా తీసుకొని అన్న క్యాంటిన్లు ప్రారంభించామని సీఎం తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో అన్న క్యాంటిన్లపై ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రకటన చేశారు. ఆకలితో ఏ ఒక్కరూ బాధపడకూడదన్న ఉద్దేశ్యంతోనే అన్న క్యాంటిన్లు ప్రారంభించామని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 100 క్యాంటీన్లు ప్రజల కడుపు నింపుతున్నాయని, మరో 104 అన్న క్యాంటిన్లు ఈనెలాఖరుకల్లా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అయితే శాసనసభ్యుల విజ్ఞప్తి మేరకు వీటిని మరో 96 పెంచి డిసెంబరు నెలాఖరుకల్లా 300 అన్న క్యాంటిన్లు అన్ని మున్సిపాలిటీలు, చిన్న పట్టణాల్లో ప్రారంభిస్తామని సీఎం ప్రకటించారు. అన్న క్యాంటిన్లకు ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తోందని చెప్పారు. ఆకలితో బాధపడేవారికి ఏదో దానం చేస్తున్నామనే భావనతో కాకుండా వారిని ప్రత్యేక అతిథులుగా గౌరవించి నాణ్యమైన ఆహారాన్ని, పరిశుభ్రమైన వాతావరణంలో అందజేస్తున్నామన్నారు. ఈ పథకం అమలు కోసం సేవా ద ృక్పథంతో పనిచేసే అక్షయపాత్ర అనే సంస్థ ముందుకొచ్చిందని, వారు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కితాబునిచ్చారు. అన్నదానం అన్ని దానాల్లో కన్నా గొప్పదని, ఈసేవలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ పథకాన్ని శాశ్వతంగా కొనసాగించేలా దీనికోసం ప్రత్యేకంగా ఒక సొసైటీ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి అందరూ ఆర్థిక చేయూత నివ్వాలని పిలుపునిచ్చారు.

# వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ సీఎం కుమారుడు



**రాజధాని వార్తలు, పెందుర్తి :** మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు రామ్‌కుమార్ ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా శనివారం విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్ కండువా కప్పి రామ్‌కుమార్‌ను, ఆయన అనుచరులను పార్టీలోకి ఆహ్వానించారు.

**ఆ నమ్మకాన్ని వైఎస్ జగన్ నిలబెడతారు: రామ్ కుమార్**

ప్రజలకు రాజకీయ నాయకులపై ఉండాల్సింది అభిమానం, నమ్మకమని ఇవి దివంగత నేత రాజశేఖర్ రెడ్డి నెలకొల్పారని నేదురుమల్లి రామ్‌కుమార్ అన్నారు. మళ్లీ ప్రజలకు రాజకీయ నాయకులపై నమ్మకం రావాలంటే అది జననేత వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్నారు. పార్టీలో చేరిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఉన్న రెండు ఆప్షన్స్‌లో ప్రజలు అనుభవం వైపు మొగ్గు చూపారన్నారు. కానీ ఈ నాలుగున్నరేళ్ల సీఎం చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని, ఈ సారి వైఎస్ జగన్‌కు అవకాశమివ్వాలని యోచిస్తున్నారని అభిప్రాయపడ్డారు. దీంతోనే నేదురుమల్లి వర్గంతో మాట్లాడి పార్టీలో చేరడం జరిగిందన్నారు. జనార్ధన్ రెడ్డి, వైఎస్సార్‌లు చాలా సన్నిహితంగా ఉండేవారని, వారి చాలా దగ్గరి నుంచి చూశానని నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. జనార్ధన్ రెడ్డి తన చివరి ఎన్నికల్లో విశాఖ నుంచే పోటీ చేశారని, లక్ష 75 వేల ఓట్లతో గెలుపొందారని తెలిపారు. నెల రోజుల క్రితమే పార్టీలో చేరాలనుకున్నా.. పాదయాత్ర విశాఖ చేరేవరకు ఎదురుచూశానని పేర్కొన్నారు.

## శ్రీవారి తిరువాభరణాలన్నీ భద్రం



**రాజధాని వార్తలు, తిరుమల :** తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర నిత్యాన్నదాన ట్రస్టు నిధులు రూ.వెయ్యి కోట్లకు చేరాయి. 1985 నుంచి ఈనెల 6వరకు అందిన విరాళాల మొత్తం వెయ్యి కోట్లకు చేరిందని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడించారు. దీంతో పాటే ప్రాణదాన, గో సంరక్షణ పథకాలకు కూడా విశేషంగా విరాళాలు సమకూరుతున్నాయని చెప్పారు. శుక్రవారం 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం అనంతరం జేఈవోలు శ్రీనివాసరాజు, భాస్కర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. శ్రీవారి హుండీ ఆదాయం కాస్త తగ్గిందన్నారు. గతేడాది ఆగస్టులో రూ.93 కోట్లు లభించగా ప్రస్తుతం రూ.82.85 కోట్లు సమకూరిందన్నారు. 2019 నూ తన క్యాలెండర్, డైరీలను 13న సీఎం చంద్రబాబు ఆవిష్కరిస్తారని, 14నుంచి వాటికి ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నా రు. కాగా, మూడు పథకాలకు రూ.3.02 కోట్లు విరాళంగా అందాయి. తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం బెంగళూరుకు చెందిన కొట్టు మురళీకృష్ణ తన కంపెనీలైన సైబర్‌హోమ్స్ సంస్థపై ఎస్వీ నిత్యాన్న ప్రసాదానికి రూ.1.01కోట్లు, ఐకానిక కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై ప్రాణదానానికి రూ.1.01కోట్లు చొప్పు న రెండు డీడీలను జేఈవోకు అందజేశారు.

## దసరా మహొత్సవంలో ఆర్జిత సేవలు నిలుపుదల



**రాజధాని వార్తలు, విజయవాడ:** దుర్గగుడిలో అక్టోబరు 10 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న దసరా మహొత్సవాల సందర్భంగా ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను నిలుపుదల చేస్తున్నట్లు దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా మహొత్సవాల సమ యంలో జరుగు ప్రత్యేక చండీహోమం, ప్రత్యేక కుంకు మార్చన జరుగుతాయని వారు పేర్కొన్నారు. ఉభయ రుసుం, టిక్కెట్లు విక్రయ ప్రారంభించే తేదీ త్వరలో తెలియపరుస్తామని దేవస్థానం వైదిక కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఇకపై రేషన్‌దుకాణాల్లో ఉప్పు,కారం

**రాజధానివార్తలు, అమరావతి :** రేషన్ షాపుల ద్వారా కారం, ఉప్పును సరఫరా చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.గతంలో ఇలాంటివి సరఫరా చేస్తే కొంత కల్తీ సరుకు వచ్చిన నేపథ్యంలో ఈ సారి అలాంటి పొరపాట్లు లేకుండా టాటా, రిలయన్స్ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకో నుంది. అటు రాష్ట్రంలో 1.44కోట్ల మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు ప్రకటించిన ప్రభుత్వం నిత్యావసర సరకుల ధరలను నియంత్రించేందుకు రూ.100 కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామని తెలిపింది.

## 28న దేశవ్యాప్తంగా దుకాణాల బంద్

**న్యూఢిల్లీ :** వాల్‌మార్ట్-ఫ్లిప్‌కార్ట్ ఒప్పందానికి వ్యతిరేకంగా ఈ నెల 28న దుకాణాల బంద్‌కు అఖిలభారత వర్తకుల సమాఖ్య పిలుపునిచ్చింది. వాల్‌మార్ట్ ప్రవేశంతో దేశీయ తయారీ రంగం ,స్థానిక వ్యాపారులు నష్టపోతాయంటున్న సీఏఐటీ 7కోట్ల మంది వ్యాపారులు ఈ బంద్‌లో పాలుపంచు కుంటారంది.కాగా సన్నకారు రైతులు ,కిరణా వినియోగదారులకు తోడ్పాటునందించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతామని వాల్‌మార్ట్ ప్రకటించింది.

## భక్తులను రక్షించి ప్రాణాలు విడిచిన డ్రైవర్

**రాజధాని వార్తలు, తిరుమల :** వాహనం నడుపుతూ ఆ డ్రైవర్ గుండెపోటుకు గురయ్యాడు. దీంతో రోడ్డు పక్కన ఆపి శ్రీవారి భక్తులను రక్షించి కన్నుమూశాడు. తిరుమల ఘాట్ రోడ్డులో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. తిరుపతి నగరం మాధవనగర్‌కు చెందిన నాగరాజ నాయుడు(56) జీపు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. తమిళనాడుకు చెందిన ఏడుగురు భక్తులతో తిరుమలకు బయలుదేరారు. అలిపిరి చెక్‌పాయింట్ చేరుకున్న ఆయనకు ఛాతీలో తీవ్రంగా నొప్పి వచ్చింది. దీంతో రోడ్డు పక్క వాహనం ఆపిన నిమిషాల వ్యవధిలో ఆయన సీటులో కుప్పకూలి పోయారు. భక్తులు మూర్ఛ వచ్చిందేమోనని చేతిలో తాళాలు పెట్టిచూశారు. అయితే నాగరాజులో చలనం లేకపోవటంతో సెక్యూరిటీ సిబ్బంది సమాచారంతో 108 సిబ్బంది వచ్చారు. ఆయన్ను పరీక్షించి మృతిచెందినట్టు పేర్కొన్నారు. కాగా, గుండెపోటు రాగానే జీపు ఆపకుండా వెళ్లి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని భక్తులు వెల్లడించారు.

## 11న వైసీపీ సమన్వయకర్తల భేటీ

**రాజధాని వార్తలు, అమరావతి :** ఏపీలో అన్ని నియోజకవర్గాలకు చెందిన వైసీపీ సమన్వయ కర్తలతో ఈ నెల 11 జగన్ భేటీ కానున్నారు.విశాఖలో జరిగే ఈ సమావేశంలో వచ్చే ఎన్నికలకు సంబంధించిన పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు,తదుపరి కార్యాచరణపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది.అసెంబ్లీ సమావేశాలకు తమ సభ్యులు వెళ్లకపోవడం, తెలంగాణలో అసెంబ్లీ రద్దు సహా పలు అంశాలపైనా ఈ భేటీలో చర్చించనున్నారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం

**రాజధాని వార్తలు, విశాఖపట్నం :** వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ఏర్పడినట్లు విశాఖ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జంషెడ్‌పూర్‌కు ఆగేయంగా 140 కిలోమీటర్ల దూరంలో, కియాంజిర్‌గఢ్‌కు 130 కిలోమీటర్ల దూరంలో తూర్పు ఈశాన్య దిశగా ఈ వాయుగుండం కేంద్రీక ృతమైందని పేర్కొన్నారు. రాగల 24 గంటల్లో క్రమేణా బలహీనపడి తుఫానుగా మారే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. ఉత్తర కోస్తా, తెలంగాణలలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు గాని, వర్షం గాని కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తా తీరం వెంబడి గంటకు 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. సముద్రంలో వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసింది. గడచిన 24 గంటల్లో సోంపేట, కళింగపట్నంలో ఒక్కో సెంటీమీటరు చొప్పున వర్షపాతం నమోదైంది.

# కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే.. ఏపీలో టీడీపీ భూస్థాపితం

## వైసీపీ నేత పెద్దిరెడ్డి



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునేందుకు ఏపీ సీఎం చంద్రబాబు సిద్ధమయ్యారని... కాంగ్రెస్ తో పొత్తు వల్ల టీడీపీకి ఎలాంటి లాభం ఉండదని వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే చచ్చిపోయిందని... ఆ పార్టీ నేతలంతా కొందరు వైసీపీలోకి, మరికొందరు టీడీపీలోకి మారిపోయారని చెప్పారు. అలాంటి కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుంటే ఏపీలో టీడీపీ భూస్థాపితం అవుతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా, ఆత్మగౌరవ నినాదంతో దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని... అలాంటి పార్టీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడం దారుణమని అన్నారు. రాష్ట్రాన్ని విడదీసిన కాంగ్రెస్ తో టీడీపీ ఎలా పొత్తు పెట్టుకుంటుందని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం అసంభవమని... అలాంటప్పుడు ఏపీకి ప్రత్యేక హోదాను కాంగ్రెస్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. బీజేపీ కానీ, మరో ఫ్రంట్ కానీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని చెప్పారు. కేంద్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినా తమ అధినేత జగన్ పోరాడి, ప్రత్యేక హోదాను సాధిస్తారని తెలిపారు. తమకు మాట్లాడేందుకు మైకే ఇవ్వనప్పుడు, అసెంబ్లీకి వెళ్లి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు.

**మీరూ స్పందించండి**
మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి
యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజధాని వార్తలు వేదికగా నిలుస్తుంది.
మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫోటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా
వివరించి వాట్సప్ ద్వారా మీ పేరుతో సహా
ఈ దిగువ ఉన్న వాట్సాప్ నంబర్లకు పంపించండి.
94406 62699


# అమెరికాలో 'ఎన్ఆర్ఐ పల్స్'

**వార్తాపత్రిక నడపాలి, పేరుప్రఖ్యాతులు సంపాదించాలని చాలా మందికి ఉంటుంది కాని అదొక యజ్ఞం..అదీ కార్పొరేట్ వార్తాపత్రికలు వచ్చిన తర్వాత చిన్న పత్రికల మనుగడ మరింతకష్టమయింది. స్థానిక వార్తలు అందించే చిన్న పేపర్లకు ఇదివరలో గుర్తింపు ఉండేది. పెద్ద పత్రికలు జిల్లా వార్తలు కూడా ప్రచురించడం ప్రారంభించాక చిన్నపత్రికల అవకాశాలు కనుమరుగయ్యాయి. ఈ పరిస్థితి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఉంది. ఇలాంటి వాతావరణంలో మనదేశానికి చెందిన వీణారావు 12 ఏళ్ల నుంచి అమెరికాలో సొంతంగా 'ఎన్ఆర్ఐ పల్స్' అనే పత్రికను నడుపుతున్నారు. భారతదేశం వెలుపల వార్తాపత్రికను నడిపిస్తున్న తొలి భారతీయ మహిళగా ఆమె 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లోనూ చోటు సాధించారు.**












అమెరికాలోని జార్జియా రాష్ట్రంతో పాటు ఇతర ఆగ్నేయ రాష్ట్రాల్లో స్థిరపడ్డ దక్షిణాసియా ప్రజలే లక్ష్యంగా ప్రతి నెలా వెలువడే వార్తా పత్రిక ఎన్ఆర్ఐ పల్స్. జార్జియాలోని అట్లాంటా నగరంలో స్థిరపడ్డ వీణా రావు దీనికి ఎడిటర్. ఆగ్నేయ అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు, వారిని ప్రభావితం చేసే ఇతర అంశాల గురించి ప్రధానంగా ఈ పత్రిక ప్రచురిస్తోంది. 2006లో వీణ ఈ పత్రికను నెలకొల్పి ఉచితంగా పాఠకులకు అందిస్తున్నారు. 'అప్పటివరకు దక్షిణాసియా ప్రజలు, ముఖ్యంగా భారతీయుల సమస్యల గురించి ప్రచురించే పత్రికలేవీ జార్జియాలో లేవు. దీంతో ఆ బాధ్యతను ఆమె భుజానికి ఎత్తుకున్నారు. ఆన్‌లైన్ ఎడిషన్లు వచ్చాక ప్రపంచవ్యాప్తంగా పత్రికలకు ఆదరణ తగ్గింది. అమెరికా అందుకు మినహాయింపు కాదు.. డబ్బులు పెట్టి వాటిని కొనేవారి సంఖ్య మరీ తక్కువ కావడంతో పాఠకులకు ఉచితంగా పత్రికను అందిస్తున్నామన్నారు. కేవలం ప్రకటనలపైనే ఆధారపడి పత్రికను నడిపిస్తున్నా 2008 ఆర్థిక మాంద్యం సమయంలో ప్రకటనలు ఇచ్చేవారు దొరకడం కష్టమవడంతో పత్రిక బడ్జెట్‌ను చాలా కుదించాల్సి వచ్చింది. ఆ సమయంలో వార్తల సేకరణతో పాటు పేజీ లేఅవుట్, డిజైనింగ్ లాంటి అన్ని పనులనూ వీణనే చూసుకున్నారు.

మూడేళ్ల క్రితం మళ్లీ ఆర్థిక సమస్య తలెత్తింది. ఈసారి పత్రికను మూసేయాలని నిర్ణయించుకుని ఒక నెల పత్రికను ప్రచురించలేదు. దాంతో ఆమెకు చాలా ఈమెయిల్స్ వచ్చాయి. అందులో ఒకరు, 'వచ్చే సంచికకు నేను పూర్తి పేజీ ప్రకటన ఇస్తాను. పత్రికను మాత్రం ఆపేయొద్దు' అని మెయిల్ చేశారు. ఎన్ని సమస్యలు ఎదురైనా పత్రికను నడిపి తీరాల్సిందే అన్న పట్టుదల ఆ మెయిల్ ద్వారా వచ్చిందంటారామె.. పత్రికను ముందుకు నడపాలన్న నా నిర్ణయం సరైనదే అని నిరూపిస్తూ గత మూడేళ్లలో 'ఎన్ఆర్ఐ పల్స్' వేగంగా విస్తరించింది' అని వీణ వివరించారు.

**ఎడిటర్ నుంచి పేపర్ బాయ్ వరకు అన్నీతానై...**

వీణ భారత్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో పనిచేశారు. అమెరికా వెళ్లాక కూడా స్థానిక పత్రికల్లో జర్నలిస్టుగా కెరీర్ కొనసాగించారు. అక్కడే వార్తల రిపోర్టింగ్‌తో పాటు పత్రిక డిజైనింగ్, ఇతర విషయాలపై పట్టు సాధించినట్లు చెబుతారు. ఆ క్రమంలో స్థానికంగా ఏర్పడ్డ పరిచయాలే తన పత్రికను ముందుకు నడపడంలో సహాయపడ్డాయని ఆమె అంటారు.

**'పత్రికా రంగం డబ్బు కోసం పనిచేసే రంగం కాదు. అలాగని డబ్బులేకుండా పత్రికను నడపలేం. అందుకే మొదట్నుంచీ బడ్జెట్‌ను అదుపులో పెట్టుకోవడానికే ప్రాధాన్యమిచ్చా. దానికోసం చాలా పనులను నేనే చేయడం మొదలుపెట్టా. : వీణారావు**

భారతీయులకు చట్ట పరంగా ఎదురయ్యే సమస్యలూ, వీసా చిక్కులూ, చదువుకుంటూ పనిచేసే వాళ్ల ఇబ్బందులూ, పండగలూ, కమ్యూనిటీ కార్యక్రమాలకు సంబంధించిన విషయాలూ, భారతీయులు నడిపే వ్యాపారాలూ, వాళ్ల విజయ గాథలకు సంబంధించిన సమాచారం పత్రికలో ప్రచురిస్తారు. పత్రికలను ప్రింట్ చేశాక దాదాపు 150కి.మీ ప్రయాణిస్తూ 70కి పైగా కేంద్రాల్లో పత్రికను సరఫరా చేస్తున్నానని ఆమె చెప్పారు. హిందూ దేవాలయాలు, షాపింగ్ కాంప్లెక్సులు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార ప్రాంగణాల్లో ర్యాకులను ఏర్పాటు చేసి అక్కడ ప్రతికను ప్రజలకు అందుబాటులో ఉంచుతానని, ఉచితమే కాబట్టి చాలామంది దాన్ని తీసుకుంటారని ఆమె వివరించారు. అలా క్రమంగా పత్రికకు గుర్తింపు పెరగడం మొదలైందని వీణ వెల్లడించారు.

ఓసారి అలా కారులో నుంచి పత్రికలు తీసి ఓ ర్యాకులో పెడుతున్నప్పుడు... నన్ను చూసి డ్రైవర్ అనుకొని, 'ఈ పత్రిక ఎడిటర్ ఎవరు? ఎక్కడి నుంచి ప్రచురిస్తున్నారు?' అని ఓ పెద్దాయన అడిగారు. 'నేనే పత్రిక ఎడిటర్'ని అని చెబితే ఆయన చాలా ఆశ్చర్యపోయారు. నాకు మాత్రం ఆ క్షణం కాస్త గర్వంగా అనిపించింది' అంటారు వీణ.'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎడిటర్ నుంచి ఆ విషయాన్ని ధ్రువీకరిస్తూ వచ్చిన ఈమెయిల్‌ను మొదట నమ్మలేకపోయానని, పాత్రికేయ రంగంపై ఉన్న ఇష్టంతో, అమెరికాలోని భారతీయుల జీవితంతో ముడిపడిన అన్ని అంశాలను వెలుగులోకి తెచ్చే ఉద్దేశంతోనే పత్రికను మొదలుపెట్టా. కానీ ప్రపంచంలోనే అలా న్యూస్‌పేపర్‌ను నెలకొల్పిన తొలి భారతీయురాలిని నేనే అని మాత్రం నాకు తెలీదు. బహుశా తొలి ఎడిటర్‌నే కాదు, అమెరికాలో పత్రికల డెలివరీ గర్ల్‌గా పనిచేసిన తొలి భారతీయురాలిని కూడా నేనేనేమో' అంటారు వీణ. 2010లో లిమ్కా బుక్‌లో చోటు దక్కడంతో స్థానికంగా 'ఎన్ఆర్ఐ పల్స్' గుర్తింపు బాగా పెరిగిందని, నాటినుంచి పత్రిక పరిధి కూడా విస్తరించిందని చెబుతారు.

కర్ణాటకలోని మంగళూరులో పుట్టి పెరిగన వీణ, పూణెలో పీజీ చేశారు. ఆ తరువాత అక్కడే జర్నలిజంలోనూ పీజీ డిప్లొమా చేసి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో కెరీర్ మొదలుపెట్టారు. మొదట్నుంచీ తెలిసిన విద్య బాగా రాయడమేనని అందుకే ఈ రంగంలో వచ్చా.. అమెరికాలో మహిళలకు లభించినంత ప్రోత్సాహం మరెక్కడా దొరకదంటారు వీణ. ఎన్ఆర్ఐ పల్స్ పత్రికతో పాటు అదే పేరుతో న్యూస్ వెబ్‌సైట్‌ను కూడా ఆమె నిర్వహిస్తున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఏ దేశంలోనైనా పత్రికను నడపడం కష్టమేననీ, పన్నెండేళ్లుగా ఆ కష్టాన్ని అధిగమిస్తూనే ముందుకు సాగుతున్నాననీ వీణ చెబుతారు. అమెరికాలోని ఆగ్నేయ రాష్ట్రాలన్నింటికీ ఎన్ఆర్ఐ పల్స్ సర్క్యులేట్ అవుతుండగా, దాన్ని దేశవ్యాప్తంగా అందుబాటులోకి తేవడమే తన లక్ష్యం అంటున్నారు వీణ. ఆల్ ది బెస్ట్ చెబుదామా..

వారం రోజుల్లోగా

పరిస్థితి మెరుగుపడాలి..

## లేదంటే సస్పెండ్ చేస్తా!

- అధికారులకు చంద్రబాబు వార్నింగ్
- టెలీ కాన్ఫరెన్స్ సీఎం ఆగ్రహం



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో డెంగీ, మలేరియాలతో పాటు పలు అంటు వ్యాధులు ప్రబలడంపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. వారం రోజుల్లోగా పరిస్థితి అదుపులోకి రాకుంటే సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అమరావతిలో ఈ రోజు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, డీహెచ్ఎంవోలు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విషజ్వరాలు ప్రబలడంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఈ వారం రోజులు ఎమర్జెన్సీ అన్న రీతిలో పనిచేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా అంటువ్యాధులు లేవనీ, ఒక్క విశాఖపట్నంలో మాత్రమే అంటు వ్యాధులు ఎందుకు ప్రబలుతున్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. హుద్ హుద్ తుఫాను సమయంలో ఉన్నట్లే తాను ఇప్పుడు కూడా వైజాగ్ కు వచ్చి అధికారులు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షిస్తానని తెలిపారు. పరిస్థితి అదుపులోకి వచ్చేవరకూ అధికారులు సెలవు రద్దు చేసుకోవాలన్నారు. ప్రజలకు అంటు వ్యాధులపై అవగాహన కల్పించాలని చంద్రబాబు సూచించారు.


## రాజధాని క్లాసిఫైడ్స్

### నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

**నీరుకొండ**
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### ఇతరములు

ఓంశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
**పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్**
ఫోన్ 9502424704, 08645 244992
సబ్ - రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

**వెంకటపాలెం**
సాయిలాస్య రియల్ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

**రాయపూడి**
రియల్ఎస్టేట్ క్రయ, విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 98484 42436

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

### షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

### హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

**విశాఖపట్నం**
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

### వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

**నీరుకొండ**
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### విద్యా సంస్థలు

**ఐనవోలు**
విఐటీ-ఏపీ యూనివర్శిటీ
ఫోన్ :0863 2370444

**నీరుకొండ**
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిటీ
ఫోన్ :0863 2343000

**గమనిక :** క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 7680994755


మహిళా రైతుల సాధికారత బిల్లును

## పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

**ఏక్తా మహిళా మంచ్ కన్వీనర్ శ్రద్ధా కస్యప్**



**రాజధాని వార్తలు, విజయవాడ :** దేశంలో80శాతం మంది మహిళలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తు న్నారని వారిలో 12శాతం మందికి కూడా భూమి హక్కులు లేవని, మహిళా రైతులకు హక్కులతో కూడిన గుర్తింపు ప్రవేశపెట్టి ఆమోదించాలని ఏక్తా మహిళా మంచ్ జాతీయ కన్వీనర్ శ్రద్ధా కశ్యప్ డిమాండ్ చేశారు. ఏక్తా మహిళా మంచ్ భూమి హక్కుల సాధికారిత యాత్ర ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగం గా సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం ఆమె విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. జాతీయ స్థాయిలో భూసింస్కరణ చట్టాన్ని అమలు చేయాలని ప్రతికుటుంబానికి 10సెంట్లు నివాస స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన జాతీయ భూ సంస్క రణల కమీటీ టాస్క్ ఫోర్సువివాదాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఏపీ రాజ ధాని అమరావతి గ్రామాల్లో తమబృందం పర్యటించగా దళిత మహిళలు అనేక సమస్యలు తమ దృష్టికి తెచ్చారన్నారు. సిఎం అక్కడే నివాసముంటున్న వారిసమస్యల పై స్పెందిచడం లేదన్నారు. ఈ సమా వేశంలో జాతీయ మహిళా భూహక్కుల యాత్ర బృందం నేతలు మంజు, శోభ, కస్తూరి, మాసనీ, దళితబహుజన ఫ్రంట్ జాతీయ నాయకులు కె.వినయకుమర్, మేళం భాగ్యారావు, పార్టీ ఎస్సీ డిపామెంట్ పుట్ట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలమ్



టూత్‌బ్రష్ ఎవరు ఎంత కాలం వాడతారు అని ఓ డెంటిస్టు అన్ని దేశాల వారిని సర్వే చేస్తున్నాడు.

అమెరికన్ అతను ఒక నెల అని చెప్పాడు.
చైనా అతను ఆరు నెలలు వాడతామని చెప్పాడు. ఇక ఇండియా వంతు వచ్చింది మన వాడు ఒకడు అందుకున్నాడు ...టూత్ బ్రష్ వాడడానికి ప్రత్యేకంగా ఓ కాలపరిమితి అంటూ మాకు ఏమి లేదు. మామూలుగా అయితే పళ్లు తోముకోడానికి వాడతాం. తర్వాత జుట్టుకి రంగు వేసుకోవడానికి వాడతాం. ఆ తర్వాత ఆభరణాలూ అవీ తోమడానికి వాడుతం ఆ తరువాత దువ్వెనలకు ఉన్న జిడ్డు వదిలించడానికి వాడుతాం, ఇంకా బూరు ఏమైనా మిగిలితే... మెషిన్లు, ఇంజన్‌లలో ఆయిల్ రుద్దడానికి వాడుతాం. బూరు మొత్తం ఊడిపోయాక... లంగాలు, పైజమాలకి నాడాలు దూర్చడానికి వాడతాం అని మన భారతీయుడి సమాధానం వినగానే స్పృహతప్పి పడిపోయాడు ఆ విదేశీ డాక్టర్ 😁😁😁😁

# రాక్‌స్టార్ బ్రయాన్ షోలో అమితాబ్, ప్రభాస్



ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న రాక్ స్టార్ బ్రయాన్ ఆడమ్స్ 7 సంవత్సరాల తర్వాత ఇండియాలో షో చేసేందుకు రాబోతున్నాడు. బ్రయాన్ షోలకు ఈవెంట్ సంస్థలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాయి. రాక్ స్టార్ రాకపై అధికారికంగా ప్రకటనతోపాటు, బ్రయాన్ ఆడమ్స్ ట్విట్టర్‌లో ఇండియాలో జరుగబోతున్న తన ఈవెంట్స్ గురించి ప్రకటించాడు. ఈసారి హైదరాబాద్‌లో కూడా ఈయన షో ఉండబోతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని సంగీత ప్రియులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే నెలలో రాబోతున్న బ్రయాన్ ఆడమ్స్ కు ఇక్కడ సూపర్ స్టార్ లు ఘన స్వాగతం పలుకబోతున్నారు. అక్టోబర్ 9న అహ్మాదబాద్ లో మొదటి షోను బ్రయాన్ నిర్వహించబోతున్నాడు. ఆ తర్వాత రెండవ షోను అక్టోబర్ 11న హైదరాబాద్ లో - 12వ తారీకున ముంబయిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చక చక జరుగుతున్నట్లుగా ఆడమ్స్ ట్విట్టర్ లో పేర్కొన్నాడు. ఇక హైదరాబాద్ ,ముంబయిల్లో ఈయన చేయబోతున్న షోలకు స్టార్ హీరోలు హోస్ట్ లుగా వ్యవహరించబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.

హైదరాబాద్ లో ఈ రాక్ స్టార్ షోకు యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హోస్ట్ గా వ్యవహరిస్తాడని తెలుస్తోంది. 'బాహుబలి'తో ఇంటర్నేషనల్ స్థాయికి చేరుకున్న ప్రభాస్ అయితే ఈ షోకు మంచి గుర్తింపు తీసుకు వస్తాడనే ఉద్దేశ్యంతో ఆయన్ను ఎంపిక చేసినట్లుగా సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. ఇక ముంబైలో జరుగబోతున్న ఈ రాక్ స్టార్ భారీ ఈవెంట్ కు బిగ్‌బీ అమితా బచ్చన్ హోస్ట్ గా వ్యవహరిస్తారని సినీవర్గాల్లో టాక్. ముంబయిలో జరుగబోతున్న షోకు బాలీవుడ్ తారలు పెద్ద ఎత్తున హాజరు కాబోతున్నాడు. ఏడు సంవత్సరాల తర్వాత బ్రయాన్ ఆడమ్స్ షోలు జరుగబోతున్న కారణంగా భారీ ఎత్తున అభిమానులు ఈ షోకు హాజరు అయ్యేందుకు ఉత్సాహంగా ఉన్నారు.





**బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ పెట్రో ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు, రైతులు, రవాణాదారులు, చిన్న, మధ్యతరహా వ్యాపరవేత్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూపీఏ హయాంలో పెట్రోలు, డీజిల్ ధరలను ప్రతి 15 రోజులకోసారి సమీక్షించే వారు. దీనినే పూలింగ్ విధానం అనేవారు. ఎన్డీఏ సర్కార్ వచ్చిన తర్వాత పూలింగ్ విధానాన్ని తీసేసి ఏ రోజు కు ఆ రోజు పెట్రో ధరలను నిరయించుకునే వెసులుబాటు చమురు కంపెనీలకు కల్పించింది.**

# పెట్రోలు, డీజిల్ ధరలు పైపైకి...



## కారు చౌకగా విదేశాలకు అమ్మకం

సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) క్రింద అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం మోడీ ప్రభుత్వం 15 దేశాలకు పెట్రోల్ లీటరు కేవలం రూ. 34కు, 29 దేశాలకు కేవలం రూ. 37కు డీజిల్ విక్రయిస్తోందని తెలిపింది. మన దేశంతో పాటు పెట్రోల్, డీజిల్ విక్రయించే దేశాలలో ఇంగ్లాండు, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, ఇజ్రాయిల్ ఉన్నాయి. భారతదేశ ప్రజలకు ప్రభుత్వం ఏ విధంగా ద్రోహం చేస్తోందో, వెన్నుపోటు పొడుస్తోందో అర్థమౌతోంది"

– కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూర్జేవాలా



ఈ విధానంలో నెలలో 10 రోజులు ఐదు పైసలు మూడు పైసలు చొప్పున ధరలు తగ్గిస్తున్న చమురు సంస్థలు మిగిలిన 20 రోజుల్లో నొప్పి తెలియకుండా పెట్రో ధరలను పెంచేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. రోజువారీగా ధరలు పెంచుకుంటూ పోతుండటంతో సామాన్యులకు పెరుగుదలలో పెద్దగా వ్యత్యాసం తెలియడం లేదు. అయితే నెల తిరిగేసరికి మా త్రం దిమ్మ తిరుగుతోంది.

ఎన్‌డీఏ ప్రభుత్వం 'విపరీతమైన పన్నులు' విధించడం ద్వారా దేశ ప్రజల నుంచి మోడీ ప్రభుత్వం రూ.11 లక్షల కోట్లు దోచుకుంటోందని ప్రతిపక్షాలు విమర్శి స్తున్నాయి.ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 మేలో పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకం కేవలం రూ.9.2 ఉండగా, ఇప్పుడు లీటరు పెట్రోల్‌పై రూ. 19.48కి పెరిగింది. డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం 2014 మేలో రూ. 3.46 ఉండగా, ప్రస్తుతం రూ. 15.33గా ఉంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని 12 దఫాలు పెంచింది. దీంతో లీటరు రూ.30కు రావాల్సిన పెట్రోలు రూ.84 అయింది.

### రాష్ట్ర ప్రభుత్వ వాట్

పెట్రోలు, డీజిల్‌పై రాష్ట్రాలు విధించే వ్యాట్ అదనంగా ఉంటోంది. మహరాష్ట్ర సర్కారు పెట్రోల్ మీద గరిషంగా 39.12 శాతం వ్యాట్ ను విధిస్తుంటే.. డీజిల్ పై పన్ను పోటును గరిష్టంగా అమలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా చెప్పాలి. తెలంగాణలో డీజిల్ మీద 26 శాతం వ్యాట్ పోటును రాష్ట్ర సర్కారు విధిస్తోంది. ఇలా కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వాలు అదే పనిగా పన్ను బాదుడు పుణ్యమా అని.. ధరలు అంతకంతకూ పెరిగిపోతున్న పరిస్థితి.

### నగర వాసులపై భారం

విజయవాడలో మొత్తం 25 పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతిరోజూ 300 కిలో లీటర్లు అంటే 3 లక్షల లీటర్లు పెట్రోల్ విక్రయిస్తారు. అదే విధంగా డీజిల్ 1.50 లక్షల కిలో లీటర్లు అంటే లక్షా యాభై వేల లీటర్లు విక్రయిస్తారు. నెలలో పెట్రోల్ ధరలో రూ.2లు వ్యత్యాసం వస్తే నగర వాసులపై పడే భారం అక్షరాలా రూ.1.80 కోట్లు. అదే విధంగా డీజిల్ ధరలో నెలలో రూ.2.78 వ్యత్యాసం వస్తే నగర వాసులపై పడే భారం రూ.1.25 కోట్లు.



జెర్మని ప్రభుత్వం పెట్రోల్/డీజల్ రేట్లను పెంచితే అక్కడి ప్రజలు అప్పటికప్పుడు నడి రోడ్డుమీద తమ కార్లను నిలిపేసి పనులకు వెళ్లిపోయారు. పరిస్థితిని అర్థం చేసుకున్న ప్రభుత్వం వెంటనే పెంచిన రేట్లను తగ్గించింది. ఈ మాత్రం యూనిటీ మన ప్రజల్లో ఉంటే దేశం బాగుపడుతుంది.

### ససేమిరా తగ్గించం

పెట్రో ధరల్ని ఉంచాలన్న ప్రతిపాదనపై మోడీ సర్కారు సానుకూలంగా లేదు. శనివారం (విజయవాడలో) లీటరు పెట్రోల్ రూ.84.09 కాగా.. లీటరు డీజిల్ ధర రూ.77.60గా ఉంది. ఒకరకంగా చూస్తే.. ఈ ధరలు గరిష్టమని చెప్పక తప్పదు. పెట్రో మంటతో బడ్జెట్ లు తలకిందులుగా మారుతున్న పరిస్థితి. దీనిపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. కానీ.. మోడీ సర్కారు మాత్రం ధరల్ని తగ్గించే విషయంలో వెనక్కి తగ్గని పరిస్థితి నెలకొంది. పెట్రో ధరలు తగ్గించమంటే ఆర్థిక క్రమశిక్షణ అవసరమని.. డాలర్ల దూకుడు ఎక్కువగా ఉండి.. రూపాయి విలువ పడిపోతున్న క్రమంలో ఇలాంటి పరిస్థితి ఉందని చెబుతున్నారు.



పెట్రోలు ధరలు పెంపునకు బ్రెజిల్‌లో జాతీయ రహదారిపై వాహనాలను నిలిపివేసి నిరసన తెలుపుతున్న వాహనదారులు

### జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినా కేంద్రం డాలర్‌తో రూపాయి మారకం తగ్గిందని కారణాలు చెబుతూ పెట్రోలు ధరలు పెంచుతోంది. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తే ధరలు భారీగా తగ్గుతాయి. రాష్ట్రాలకు రూ.20 వేల కోట్లు ఇవ్వాల్సి వస్తుందని కేంద్రం నిరాకరిస్తోంది.

– ఖాన్

కేరళ వరద బాధితులకు

# ర్యాట్ ఫీవర్



ఇటీవలే కేరళలో పెద్ద ఎత్తున వచ్చిన వరదల కారణంగా ర్యాట్ ఫీవర్ అని పిలిచే లెప్టోస్పైరోసిస్ విజృంభించి 11 మంది మరణించగా, వందలాది కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా భాగంగా వరద నీటిలో తడిసిన వారందరికీ డాక్సీసైక్లిన్ మాత్రలను సరఫరా చేసింది. ఈ మాత్రలను వేసుకోని వారంతా ఇప్పుడు జ్వరం, కండరాల నొప్పులతో ఆసుపత్రుల్లో చేరుతున్నట్లు తెలుస్తోంది.అయితే, ర్యాట్ ఫీవర్ మరణాలు కేవలం 13 జిల్లాలలోని 5 జిల్లాలలో మాత్రమే సంభవించాయని, అందువల్ల ఆందోళన చెందనవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.'రాష్ట్రంలో వరద అనంతర పరిస్థితుల కారణంగా అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రజలందరూ డాక్సీసైక్లిన్ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రటరీ రాజీవ్ సదానందన్ తెలిపారు. ఎలుకల్లో ఉండే లెప్టోస్పైరా బ్యాక్టీరియా వరద కారణంగా ఎలుకలు ఆ నీటిలో మునిగి పోయినపుడు నీటిలోకి ప్రవేశిస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్‌కు చెందిన వైరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వి.రవి తెలిపారు. బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ దాదాపు రెండు వారాల పాటు మానవ శరీరంలో ఉంటుందని ఆయన తెలిపారు.కేరళలో భారీ వర్షాలు, వివిధ డ్యాముల నుంచి నీటి విడుదల కారణంగా, దాదాపు 10 లక్షల మంది తమ ఇళ్లు వదిలి పునరావాస శిబిరాలలో తల దాచుకుంటున్నారు. వ్యాధిలక్షణాలు ఉన్న వారంతా ఇప్పుడు ఆసుపత్రులకు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.ర్యాట్ ఫీవర్ కారణంగా జ్వరం, కండరాల నొప్పితో పాటు తలనొప్పి, ఊరికే అలసిపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు కిడ్నీ, కాలేయంపై కూడా ప్రభావం కనిపిస్తుంది.వరద నీరు తగిలిన ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ ఒక డాక్సీసైక్లిన్ టాబ్లెట్ వంతున వారం రోజుల పాటు వేసుకోవాలని, దానితో పాటు పెన్సిలిన్ తీసుకోవాలని డాక్టర్ రవి సూచించారు. కేరళలోని అన్ని ఆసుపత్రుల్లో ఈ వ్యాధులన్నిటికీ పెన్సిలిన్‌తో పాటు అవసరమైన మందులు ఉన్నాయని కేరళ ఆరోగ్య సేవల డైరెక్టర్ డాక్టర్ సరిత వెల్లడించారు. ర్యాట్ ఫీవర్‌కు ఎలాంటి చికిత్స చేయాలో ప్రైవేట్ ఆసుపత్రులకు కూడా సూచనలు చేశామని తెలిపారు.

# రూపాయి పతనం ఆగేదెన్నడు ?



మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి డాలరు -రూపాయి సమానంగా ఉండేవి. ప్రస్తుతం అది 72 రెట్లు పడిపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. రూపాయి ఇంతగా పడిపోవటానికి కారణం కరెంటు ఖాతాలో పెరిగిన లోటు.. బ్యాంకర్ల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్ గా చెబుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. జీడీపీ.. ద్రవ్యలోటు నివేదిక తర్వాత మరెలాంటి పరిస్థితి ఉంటుందన్నది ఆందోళనగా మారింది.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నివేదికల ఆధారంగా ప్రపంచంలో 2014-2018 మధ్య మోడీ పాలనలో గ్లోబల్ వాణిజ్యం 3శాతం పెరిగింది. కానీ మన దేశ వస్తు ఎగుమతు మాత్రం తగ్గింది. అంతర్జాతీయ వాణిజ్య లోటు గడచిన 60 నెలల్లో పోలిస్తే 1661 కోట్ల డాలర్లతో జూన్ నాటికి అధికంగా ఉంది. మరోవైపు వచ్చే పదేళ్ళ కాలంలో అంతర్జాతీయంగా అమెరికా, యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు తమ దిగుమతులను తగ్గించుకోనున్నాయని ఐఎంఎఫ్ తెలియజేసింది. కనుక ప్రస్తుత వాణిజ్యలోటు ఇంకా పెరిగే అవకాశాలున్నాయి.

వాజ్ పేయ్ హయాంలో డాలర్ తో రూపాయి మారకం విలువ యాభైకి దగ్గరగా వస్తుంటే హాహాకారాలు చేసిన దుస్థితి. ఆతర్వాత ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మన్మోహన్ కాలంలోనూ రూపాయికి బలం చేకూరకున్నా.. ఇంత భారీ ఎత్తున బక్కచిక్కలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆర్థిక రంగ నిపుణుల అంచనాల ప్రకారం జీవిత కాల కనిష్టానికి రూపాయి చేరటానికి కారణం

- ఎగుమతులకు మించి పెరిగిన దిగుమతుల భారం.
- అంతర్జాతీయ మార్కెట్లో పెరుగుతున్న ముడి చమురు ధరలు
- అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగే కొద్దీ ఎఫ్ పిఐలు భారత రుణ ఈక్విటీ మార్కెట్లో ఉన్న తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవటం
- కరెంటు ఖాతా లోటులో పెరుగుతున్న వైనం
- దేశానికి వచ్చే డాలర్ల కంటే దేశం నుంచి తరలిపోతున్న డాలర్లు ఎక్కువకావడం.

మరింత ఆందోళన కలిగించే అంశం ఏమంటే.. డాలరుతో రూపాయి మారకం విలువను రూ.70 దగ్గర ఉంచేందుకు ఆర్ బీఐ ఇప్పటివరకూ తన దగ్గర ఉన్న 43 వేల డాలర్ల నిల్వలోనుంచి 3000 కోట్ల డాలర్లను అమ్మేసింది. అయినా.. ఫలితం లేకుండా పోయింది.

డాలరుతో రూపాయి మారకం విలువ బాగా ప్రభావితమైన 2012-14 మధ్య కాలంలో 50.56 నుంచి 68.36కు తగ్గిపోయింది. ఆ తర్వాత నుంచి డాలరుతో రూపాయి విలువ మరింత పడిపోకుండా ఉండేందుకు కిందామీదా పడినా.. ఆ ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. ఫలితంగా తాజాగా రూ.72.05 వద్దకు రూపాయి విలువ పడిపోయింది. గడిచిన ఎనిమిది నెలల్లో దాదాపు ఏడు రూపాయిల చిల్లర వరకూ డాలరుతో రూపాయి మారకం విలువ పడిపోవటం గమనార్హం.

ఒక డాలర్ నోటు ముద్రించడానికి ఫెడరల్ బ్యాంక్ ఆఫ్ అమెరికాకు కొన్ని సెంట్లు మాత్రమే ఖర్చవుతుంది. కానీ విదేశాల్లోని ప్రజలు ఆ వంద డాలర్ల నోటు మారకపు విలువ కోసం నిజంగా 100 డాలర్ల విలువ గల వస్తువులను తయారుచేసి అమెరికా చేతుల్లో పోయాల్సి వస్తోంది. కొద్దిమంది అమెరికన్ల విలాసభోగాలకు, కార్పొరేట్ కంపెనీల అభివృద్ధి కోసం ప్రపంచ దేశాల ప్రజలు త్యాగాలు చేయాల్సి వస్తోందని అమెరికన్ ఆర్థికవేత్త బేరీ ఎర్షన్ గ్రీన్ అన్నారు.

**పెట్రోలు ధరలను నియంత్రిస్తాం.. రపాయి పతనాన్ని ఆపుతాం అని ప్రగల్భాలు పలికిన మోడీ ఇప్పుడు నోరు మెదపడం లేదు.**




– ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

## సమాచార, పౌరసంబంధాల కార్యదర్శిగా రామాంజనేయులు



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** సమాచార, పౌరసంబంధాలశాఖ కార్యదర్శిగా బి.రామాంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఉద్యోగ విరమణ చేసిన ఆయన్ని ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శిగా తాత్కాలిక ప్రాతిపదికపై నియమించి సేవలు ఉపయోగిం చుకుంటోంది. ఇప్పుడు సమాచార, పౌరసంబంధాల శాఖకు బదిలీ చేసి 2019 మార్చి 31 వరకు ఆయన కార్యదర్శిగా కొనసాగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఎక్స్-అఫీషయో కార్యదర్శిగా ఉన్న ఎస్. వెంకటేశ్వర్ మళ్లీ యథావిధిగా సమాచార, పౌరసంబంధాల కమిషనర్‌గా కొనసాగుతారు. ఆంధ్రప్రదేశ్ తాగునీటి సంస్థ ఎండీ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శిగా కూడా కొనసాగేలా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

# నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం



**నిజాం వస్తువుల్లో ప్రధానమైనది. టిఫిన్ బాక్స్. దీనిని పూర్తిగా బంగారంతో తయారు చేసి, కెంపులు, పచ్చలు పొందుపరిచారు. ఇది రెండు కిలోల బరువు ఉంటుంది. అలాగే కప్పు, సాసర్, బంగారు స్పూన్. ఇవి నిజాం నిత్యం వాడేవి. ఈ నెల 2వ తేదీ వరకు ఇవి మ్యూజియంలో ఎందరినో ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వస్తువులు చోరీకి గురికావడం మా కుటుంబానికి తీవ్ర వేదన కలిగించిందని ఆయన మునిమనువడు నవాబ్ నజఫ్ అలీఖాన్ వాపోయారు.**



(మొదటిపేజీ తరువాయి)

నిజాం వినియోగించిన దుస్తులతో పాటు పలురకాల సెంట్లు, పాదరక్షలు, టోపీలు, బ్యాగులు ఉన్నాయి. సిక్కులు, రోమన్ క్యాథలిక్కులు, ఇతర మతస్తులు నిజాంకు బహుకరించిన బంగారు, వెండి కళాఖండాలు ఉన్నాయి. నిజాంకు వివిధ అభివద్ధి పనులు ప్రారంభించినప్పుడు బంగారు తాపీలు, డబ్బాలు బహుకరించారు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల భవనం, మొజంజాహీ మార్కెట్, నాంపల్లి రైల్వేస్టేషన్,హైకోర్టు భవనం, ఉస్మానియా ఆస్పత్రి, నిలోఫర్ ఆస్పత్రి తదితర కట్టడాల నమూనాలను వెండితో తయారు చేయించి, ఆయనకు బహుమతులుగా వాటిని అందజేశారు. ఇవి సుమారు 500 వరకు ఉంటాయి.

నిత్యం నిజాం వాడిన వాటిల్లో ముఖ్యమైనది మేడమీదకు వెళ్లే లిఫ్ట్ ఒకటి. గిలకబావిపై చెక్కతో చేసిన చక్రంలా ఉండే.. పైకి, కిందకు వచ్చేలా తాళ్లతో లాగే మ్యానువల్ లిఫ్టును తయారు చేశారు. నిజాం ఆ లిఫ్టులో మస్రత్‌మహల్ పైఅంతస్తుకు వెళ్లి వచ్చేవారు. 150 ఏళ్లనాటి ఈ లిఫ్ట్ కూడా మ్యూజియంలో ఉంది.


### శిథిలావస్థలో చెక్కమెట్లు

వందల ఏళ్ల క్రితం నాటి విలువైన వస్తువులు నిజాం మ్యూజియంలో ఉన్నాయనే విషయం అందరికీ తెలుసు. ట్రస్ట్ నిర్వాహకులు సరైన భద్రత కల్పించలేదు. అంతులేని నిర్లక్ష్యం వల్లే ఈ చోరీ జరిగింది. పోలీసు కమిషనర్‌కి ఫిర్యాదు చేశాం. మ్యూజియంలో అడుగు పెడితే శిథిలావస్థలో ఉన్న చెక్కమెట్లు దర్శనమిస్తాయి. దీని బట్టే ఇది ఎంతగా నిర్లక్ష్యానికి గురవుతుందో అర్థమవుతుందని నజఫ్ అలీఖాన్ వాపోయారు.

నిజాం దుస్తులు భద్రపరుచుకోవడానికి టేకుతో రూపొందించిన అతిపెద్ద అల్మారా కూడా విశిష్టమనదే, ఇది విశాలంగా ఉండి, సుమారు 140 అరలు ఉన్నాయి. నిజాం ఎక్కువగా వాడిన రోల్స్ రాయ్స్, జాగ్వార్ మార్క్ కార్లు ఇప్పటికీ ఫలక్‌నుమా ప్యాలెస్ వెనుక భాగంలో ఉన్నాయి.

– బోస్

## నిజాం కోరిక మేరకే మ్యూజియం



"తన ఆశయాలకు తగినట్లు మ్యూజియం ఏర్పాటు చేయాలని ఏడో నిజాం కన్న కలను ఆయన కోడలు ప్రిన్స్ దుర్రెషహవ్వార్, తనయుడు-మ్యూజియం ట్రస్టు ఛైర్మన్ ముకరంజా నెరవేర్చారు" అంటారు నిజాం చరిత్ర పరిశోధకులు మహ్మద్ సఫీవుల్లా.

ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాతికేళ్ల వయస్సులో 1911 ఆగస్టు 29న దక్కన్ సింహాసనాన్ని అధిష్టించారు. 1911 నుంచి 1948 సెప్టెంబరు 17 వరకు దక్కన్ సంస్థానాన్ని ఆయన పాలించారు. 1937 నాటికి తన పాలన 25 ఏళ్ల పూర్తి చేసుకొని రజతోత్సవాలు నిర్వహించినపుడు దేశ, విదేశీ రాజకీయ ప్రముఖులు, దక్కన్ సంస్థానంలోని జాగీర్‌దారులు, సామంతులు, అతిథులతో పాటు సాధారణ జనం హాజరై ఆయనకు విలువైన, అరుదైన కళాఖండాలను బహుమతులుగా ఇచ్చారు. వాటినే మ్యూజియంలో ఉంచారు. హైదరాబాద్ నగర చారిత్రక ఆనవాళ్ళు ఇక్కడున్నాయి. బంగారపు పూతతో చేసిన సింహాసనం, అత్తరు కోసం అత్యద్భుతంగా చెక్కిన వెండి సీసాలు, నిజాంకు భద్రాచలం పాల్వంచ రాజులు బహుకరించిన వెండి సీసాలు, మైసూర్ రాజులు ఇచ్చిన ఏనుగు దంతాలతో చేసిన చార్మినార్, ఫ్రాన్సులో తయారైన టీకప్పులు, లండన్‌లో చేసిన కాఫీసెట్, బస్రా పట్టణంలో అతిపెద్ద సైజులోని ముత్యంతో చేసిన వాకింగ్ స్టిక్.. ఇలా ఇక్కడ ఉన్న ప్రతీ వస్తువుకు ఏదో ఒక ప్రత్యేకత ఉంది. దక్కన్ చరిత్రను కళ్లకు కట్టినట్లు విశదీకరిస్తుంటాయి. ఈ మ్యూజియం 1750లో రెండో నిజాం.. అలీఖాన్ నిర్మించిన మస్రత్ మహల్ భవన సముదాయంలో ఉంది" అని చెప్పారు మహ్మద్ సఫీవుల్లా.

ఈయన నిజాంల చరిత్ర పై అనేక పుస్తకాలు రాయడంతో పాటు ఆనాటి నాణేలను, నిజాంలు రాసిన లేఖలను సేకరించారు. ది దక్కన్ హెరిటేజ్ సంస్థకు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com